



- ఆఖరి ఆయకట్టుకు అందని ఎస్సార్బీసీ సాగునీరు
- 42 వేల ఎకరాలకు సాగునీరు ప్రశ్నార్థకం
- పూర్తిగా దెబ్బతిన్న ఎస్సార్బీసీ మెయిన్ కెనాల్
- తెగిపోతున్న కాల్వలు, ఇబ్బందుల్లో రైతులు

చివరికి కష్టమే..!

బనగానపల్లె, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం రైట్ బ్రాంచ్ కెనాల్ (ఎస్సార్బీసీ) ద్వారా 1,53,936 ఎకరాలకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రధాన ఎస్సార్బీసీ కాలువలు, పంటకాలువలు, డిస్ట్రిబ్యూటరీ కాలువలను ఏర్పాటు చేసింది. 2000 సంవత్సరంలో పనులు పూర్తి అయ్యాయి. అయితే 2002 నుంచి ఎస్సార్బీసీకి నీటిని విడుదల చేయడంతో పొలాలకు సాగునీరు అందుతోంది. బనగానపల్లె నియోజకవర్గంలోని బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల మండలాలతో పాటు పాటు పాణ్యం, ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని దొర్నిపాడు, ఉయ్యాలవాడ మండలాల్లో 1,53,936 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. అయితే ప్రధాన కాల్వ దెబ్బతినడంతో పొలాలకు తగినంత ఆయకట్టు నీరు అందడం లేదు. ఈ పరిస్థితుల్లో నేటికీ 42వేల ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీరు అందడం లేదు. ఆ రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

రిజర్వాయర్లలో తగ్గిన నీటి నిల్వలు

గోరుకల్లు రిజర్వాయర్లలో 12.44 టీఎంసీల నీటిని నిల్వ ఉండాలి. అలాగే అవుకు రిజర్వాయర్‌లో 4.148 టీఎంసీల నీటిని నిల్వ ఉంచాలి. అయితే గోరుకల్లు రిజర్వాయర్‌లో నిర్మాణం వల్ల చుట్టుపక్కల గ్రామాల్లోకి నీరు ఉబుకుతుండడం, రిజర్వాయర్ కట్ట ఇంకా 4 మీటర్లు ఎత్తు పెంచాల్సి ఉండడంతో గోరుకల్లులో నీటిని పూర్తిస్థాయిలో నిల్వ ఉంచడం లేదు. కేవలం 10 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ ఉంచుతున్నారు. గత సంవత్సరం అవుకు రిజర్వాయర్‌లో ప్రస్తుతం కేవలం ఒక టీఎంసీ నీటిని నిల్వ ఉంచారు. దీంతో ఆ రిజర్వాయర్‌లో నీటి నిల్వ సామర్థం గణనీయంగా తగ్గిపోయింది. గత రబీసీజన్ పూర్తయ్యే సరికి అవుకు రిజర్వాయర్‌లో మూడు టీఎంసీల నీటి నిల్వ ఉండేది. కానీ ఈ ఏడాది కేవలం 1 టీఎంసీకే పరిమితం కావడం ఆందోళన కలిగిస్తోంది.



కాలువ లైనింగ్ దెబ్బతినడంతో మొలిచిన పిచ్చిమొక్కలు

దెబ్బతిన్న ఎస్సార్బీసీ ప్రధాన కాలువ

ఎస్సార్బీసీ ప్రధాన కాలువలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ నుంచి ఎస్సార్బీసీ కాలువ ప్రారంభమవుతుంది. ఎస్సార్బీసీ కాల్వ మొత్తం దూరం 116 కిలోమీటర్లు ఉంది. గోరుకల్లు రిజర్వాయర్ నుంచి మాత్రం అంటే పాణ్యం మండలం నుంచి ఆయకట్టుకు నీరు అందుతుంది. 1,53,936 ఎకరాల ఆయకట్టుకు నీరు అందాల్సి ఉంది. కాని కాల్వల మరమత్తులు లేకపోవడంతో 42 వేల ఎకరాలకు నేటికీ సాగునీరు అందడం లేదు. గోరుకల్లు నుంచి అవుకు రిజర్వాయర్ వరకు 57.7 కిలోమీటర్ల మేర మెయిన్ కెనాల్స్ పూర్తిగా దెబ్బతిన్నాయి. కాల్వలు దెబ్బతినడంతో ఎస్సార్బీసీ మెయిన్ కెనాల్ అవుకు మండలం మెట్టుపల్లె వద్ద రెండుసార్లు, బనగానపల్లె మండలం వెంకటాపురం వద్ద రెండు సార్లు, అలాగే బనగానపల్లె పట్టణం సమీపంలో ఒక సారి ప్రధాన కాల్వలకు గండిపడ్డాయి. పలుచోట్ల చిన్నపాటి గండ్లు కూడా పడ్డాయి. వాటి ద్వారా నీటి వృథా జరుగుతోంది. ఏడేళ్ల క్రితం ప్రధాన కాలువ దెబ్బతినడంతో బనగానపల్లె పట్టణంలోకి ఎస్సార్బీసీ నీరు ప్రవహించింది. అలాగే పంట కాలువలు దెబ్బతిన్నప్పుడు వేసిన పంటలు దెబ్బతిన్నాయి. గోరుకల్లు రిజర్వాయర్ నుంచి అవుకు రిజర్వాయర్ వరకు 57.7 కిలోమీటర్ల మేర ప్రధాన కాలువ వెంబడి వేసిన సిమెంట్ లైనింగ్ పూర్తిగా దెబ్బతింది. కొన్ని చోట్ల ప్రధాన కాలువలో సిమెంట్ లైనింగ్ స్థానంలో పిచ్చిమొక్కలు మొలిశాయి. ఎస్సార్బీసీ ప్రధాన కాలువ నుంచి వచ్చే సాగునీరు డిస్ట్రిబ్యూటరీ, ఫీడర్ ఛానళ్ల ద్వారా పంటల సాగుకు నీరందించాల్సి ఉంది. కాలువల్లో పూడికలు చేరడంతో నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడ్డాయి.

చివరి ఆయకట్టు రైతుల ఆవేదన



ఎస్సార్బీసీ ఆయకట్టు మొత్తం 1.53 లక్షల ఎకరాలకు గాను కేవలం 1.11 లక్షల ఎకరాలకు మాత్రమే పంట కాలువలు ఉన్నాయి. మిగతా ఎకరాలకు పాతికేళ్లుగా పంట కాలువలు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందక పంటలు పండించుకోలేకపోతున్నారు. 70 శాతం మాత్రమే పంట కాలువలు పూర్తయ్యాయి. బనగానపల్లె మండలంలో 20 వేలకు పైగా ఎకరాలకు సాగునీరు, మిగతా అవుకు, సంజామల, కోవె లకుంట్ల, మండలాల్లో 22వేల ఎకరాలకు నేటికీ సాగునీరు అందడం లేదు. పంట కాలువల నిర్మాణం పూర్తి చేయకపోవడమే ఇందుకు కారణం. దీనికి తోడు ఎస్సార్బీసీ డిస్ట్రిబ్యూటరీ కాలువల్లో పూడిక చేరి కంపచెట్లు పెరిగి లైనింగ్‌లు దెబ్బతిన్నాయి. కనీసం దారి కూడా కనపడని పరిస్థితులు నెలకొన్నాయి. వీటి మరమ్మతుల కోసం అధికారులు ప్రతిపాదనలు పంపుతున్నా నిధులు మంజూరు కావడం లేదు.



రంధ్రాలు పడ్డ మెయిన్ కెనాల్ లైనింగ్

కాల్వకు మరమ్మతులు చేపట్టాలి



ఎస్సార్బీసీ కాల్వపూర్తిగా దెబ్బతింది. ప్రారంభం నుంచి ఇప్పటి వరకు మరమతులు చేపట్టిన దాఖలాలు లేవు. నిధులు మంజూరు కావడం లేదని చెబుతూ కాల్వ నిర్వహణను అధికారులు గాలికి వదిలేశారు. ఈసారి కాల్వకు నీటిని వదిలే సమయానికి కాల్వకు మరమతులు చేపడితే బాగుంటుంది.

- గుడిపాటి శివ, రైతు అవుకు

గండ్లు పడితే నష్టపోవాల్సి వస్తుంది



ఎస్సార్బీసీ కాల్వకు ఇరువైపులా వేసిన కాంక్రీడ్ బెడ్డింగ్ దెబ్బతినడంతో గండ్లుపడే అవకాశం ఉంది. కాల్వకు 1500 క్యూసెక్కులకు నీటిని వదిలితే ఖచ్చితంగా గండ్లు పడుతాయి. అలాంటి విపత్కర పరిస్థితులు రాకము నుపే అధికారులు నిధులు మం జూరు చేయించి కాల్వకు మరమ్మతులు చేయించాలి.

-గొంగటి జగదీశ్వరరెడ్డి, మెట్టుపల్లె గ్రామం

ప్రభుత్వానికి నివేదికలు పంపాం



ఎస్సార్బీసీ కాల్వ దెబ్బతిన్న మాట వాస్తవమే. ప్రభుత్వానికి మరమ్మతుల కోసం రూ.20కోట్లతో ప్రణాళికలు రూపొందించి నివేదికలు పంపించాం. నిధులు మంజూరు కాలేదు. నిధులు మంజూరైతే మరమతు పనులు చేపడతాం.

- మల్లికార్జున, ఎస్సార్బీసీఈఈ, బనగానపల్లె

పెరిగిన పత్తి ధర

- క్వింటా గరిష్ఠంగా రూ.7,855



మార్కెట్‌కు వచ్చిన పత్తి దిగుబడి

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పత్తి ధరలు రోజు రోజుకి పెరుగుతున్నాయి. బుధవారం పత్తి ధర క్వింటా గరిష్ఠంగా రూ.7,855 పలికింది. గత వారంతో పోల్చితే క్వింటాపై రూ.250కి పైగా ధర పెరిగింది. పత్తి ధరలు మళ్లీ పెరగడంతో రైతులు నిల్వ ఉన్న పత్తిని అమ్ముకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో దూది ధరలు పెరగడం వల్ల ఆదోని మార్కెట్లో ధరలు పెరిగాయని కాటన్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్నాయని తెలిపారు. బుధవారం మార్కెట్‌లో 471 క్వింటాళ్ల పత్తి విక్రయానికి వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.4,916, గరిష్ఠ ధర రూ.7,855 సగటున రూ.7,470 పలికింది.

విహార యాత్ర.. విషాదం



తండ్రి సులేమాన్, ఫైజాన్ (ఫైల్ ఫొటోలు)

పర్హాన్ (ఫైల్)

- సుంకేసుల వద్ద నదిలో దిగి తండ్రి, ఇద్దరు కొడుకులు దుర్మరణం

వివరాలు 7లో..

హైవే పనులకు సహకరించండి: కలెక్టర్

పాములపాడు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి 340-సీ (హైవే) పనులకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ రాజకుమారి కోరారు. పాములపాడు మండలంలోని క్రిష్ణరావుపేట గ్రామస్థులతో కలెక్టర్ రాజకుమారి, జేసీ విష్ణుచరణ్, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారితో గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఎర్రగూడూరు గ్రామంలో అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణపు పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. పాములపాడులోని శారదవిద్యానికేతన్ పాఠశాల యాజమాన్యంతో కలెక్టర్ మాట్లాడి రహదారి నిర్మాణపు పనులకు సహకరించాలన్నారు. అదేవిధంగా జెరుషలేం ప్రార్థనా మందిరానికి సంబంధించి కోర్టులో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. అధికారులు సూచించిన మేర స్థలాన్ని హైవేకు అప్పగించాలని సూచించారు. క్రిష్ణరావుపేట గ్రామంలో సుంకులమ్మ దేవాలయాన్ని తొలగించాలన్నారు. ఈ క్రమంలో గ్రామస్థులు అభ్యంతరం తెలిపారు. ఆలయానికి సంబంధించిన నష్ట పరిహారం అందలేదని, పరిహారం వచ్చాకే ఆలయాన్ని మరోచోటకు తరలిస్తామన్నారు. ప్రభుత్వ స్థలంలో ఉన్న భవనాలు, మందిరాలకు నష్టపరిహారం రాదని కలెక్టర్ తేల్చి చెప్పారు. మండ్లెం గ్రామం నుంచి ఆత్మకూరు వరకు 62 కిలోమీటర్ల మేర హైవే పనులు జరుగుతున్నాయన్నారు. అందులో 600 మీటర్ల మేర అక్కడక్కడ చిన్నపాటి సమస్యలు ఉన్నాయి. వాటిని కూడా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే పీడీ పద్మ డీఎస్పీ రామాంజినాయక్, ఆర్డీవో నాగజ్యోతి, సీఐలు సురేశ్‌కుమార్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ సుభద్రమ్మ, ఎస్‌ఐ సురేశ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు



క్రిష్ణరావుపేట గ్రామంలో గ్రామస్థులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ, జేసీ

బీఈడీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ 1,4 సెమిస్టర్ ఫలితాలను పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు విడుదల చేశారు. 1వ సెమిస్టర్‌లో 350 కి 148, 4వ సెమిస్టర్‌లో 108 మంది పరీక్షలు రాయగా 52 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.

జేఈఈ-మెయిన్స్-2 ప్రవేశ పరీక్ష ప్రారంభం



పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రఖ్యాతి గాంచిన ఐఐటీ, ఎన్ఐటీ విద్యాసంస్థల్లో బీటెక్, బీఆర్క్, బీప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ మెయిన్స్-2 ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష బుధవారం కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య ప్రారంభమైంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో కర్నూలు నగరంలోని అయాన్ డిజిటల్ సెంటర్‌లో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలు ఏప్రిల్ 2 నుంచి 9వ తేదీ వరకు కొనసాగుతాయి. పేపర్-1 ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్ పరీక్ష మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగింది. రెండు గంటల ముందే పరీక్ష కేంద్రం గేటు వద్ద అభ్యర్థులను పరీక్ష నిర్వహకులు పరిశీలించి లోపలికి అనుమతించారు. అభ్యర్థులు వెంట తెచ్చుకున్న బ్యాగ్‌లు, సెల్‌ఫోన్లను భద్రపరుచుకోవడానికి డిపాజిట్ కౌంటర్లను ఏర్పాటు చేశారు.

బీటీ నాయుడు అను నేను..



అమరావతిలో ఎమ్మెల్సీ బీటీ నాయుడు చేత ప్రమాణస్వీకారం చేయిస్తున్న శాసనమండలి చైర్మన్ మోషెను రాజు

- ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన బీటీ
- హాజరైన మంత్రి అచ్చెన్నాయుడు, కాలువ శ్రీనివాసులు, తిక్కారెడ్డి

కర్నూలు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): శాసనమండలి సభ్యుడిగా బీటీ నాయుడు బుధవారం ప్రమాణాస్వీకారం చేశారు. శుభముహర్తం మధ్యాహ్నం 1:15 గంటలకు ఆయన శాసనమండలిలోని చైర్మన్ కార్యాలయంలో మండలి చైర్మన్ మోషెనురాజు బీటీ నాయుడు చేత ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులు, టీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి, ఏపీ కురవ/కురబ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డితో పాటు ఆదోని, మంత్రాలయం, ఆలూరు, ఎమ్మిగనూరు నియోజకవర్గాల నుంచి టీడీపీ శ్రేణులు, అభిమానులు విజయవాడకు తరలివెళ్లారు. శాసనమండలి సెక్రెటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర, సెక్రెటరీ రాజ్‌కుమార్‌లు ఎమ్మెల్సీల ప్రమాణాస్వీకారానికి ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్సీగా బీటీ రెండోసారి బాధ్యతలు చేపట్టారు. ప్రమాణ స్వీకారానికి ముందుగా బీటీనాయుడు, సతీమణి పద్మ, కుమార్తె రవళికతో కలసి కనకదుర్గమ్మ ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌లను

మిగతా 6లో..

రేపు విజయవాడలో ఆర్యవైశ్య సమ్మేళనం

● విజయవంతం చేయాలని కుడా చైర్మన్ పిలుపు



కర్నూలు అర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈనెల 4న జరగనున్న ఆర్యవైశ్య సమ్మేళనం విజయవంతం చేయాలని కుడా చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్.కన్వెన్షన్ హాలులో నిర్వహించే కార్యక్రమానికి మంత్రి టీజీ భరత్, జగ్గయ్య పేట ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంలో ఆర్యవైశ్యులు ఎంతో కృషి చేశారన్నారు. ఆర్యవైశ్యులకు చంద్రబాబు తగిన గుర్తింపు ఇస్తున్నారన్నారు. ఆర్యవైశ్య సమ్మేళనం కార్యక్రమానికి భారీగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆర్‌యూ, క్లస్టర్ పాలనపై ఆరా..!

● ప్రిన్సిపాల్స్, రిజిస్ట్రార్లతో వీసీ భేటీ



సమావేశంలో మాట్లాడుతున్న ఉపకులపతి

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ, క్లస్టర్ యూనివర్సిటీల పరిపాలనా తీరుపై ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ ఉమా ఆరా తీశారు. బుధవారం రాయలసీమ యూనివర్సిటీలో రెండు యూనివర్సిటీలకు చెందిన రిజిస్ట్రార్లు, ప్రిన్సిపాళ్లు, డీన్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్సిటీల్లో తరగతుల నిర్వహణ, పరీక్షల విభాగాల్లో అనుసరిస్తున్న పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు.

టీసీసీ శిక్షణకు దరఖాస్తులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు(టీసీసీ) 42 రోజుల కోర్సుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ శామ్యూల్ పాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 1 నుంచి జూన్ 11వ తేదీ వరకు విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కడప, అనంతపురం జిల్లా కేంద్రాల్లో శిక్షణా తరగతులు కొనసాగుతాయన్నారు. ఏప్రిల్ 25వ తేదీలోగా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవడానికి చివరి గడువు అన్నారు. 2025 సంవత్సరం మే నెల ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండి 45 సంవత్సరాలలోపు వయసు ఉన్న వారు అర్హులు అన్నారు. పదో తరగతి పాసై టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు లోయర్ పూర్తి చేసి ఉండాలన్నారు. ఒకేషనల్ కోర్సు పూర్తి చేసిన వారు అర్హులన్నారు. మే ఒకటో తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని డీఈఓ వెల్లడించారు.

రేషన్ దుకాణాలపై దాడులు

● 6ఏ కేసులు నమోదు



ఎండీయూను తనిఖీ చేస్తున్న అధికారులు

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని పలు రేషన్ దుకాణాలపై సివిల్ సప్లైస్, విజిలెన్స్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఎండీయూ ఆపరేటర్ నెంబర్11 వద్ద 539 కిలోల బియ్యం, 164 ప్యాకెట్ల చక్కెర, భౌతిక నిల్వల్లో తక్కువగా ఉన్నందున 6ఏ కేసు నమోదు చేశారు. రేషన్ దుకాణం నెంబర్ 113 డీలర్ వద్ద ఉండాల్సిన బియ్యం కన్నా 86 సంచుల బియ్యం తక్కువగా ఉన్నందువల్ల అతడిపై కూడా 6ఏ కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌ఓ రాజా రఘువీర్, ఏఎస్‌ఓ రామాంజనేయ రెడ్డి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

స్థిరంగా ఎండుమిర్చి ధరలు

● క్వింటా రూ.10,350



వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కి విక్రయానికి వచ్చిన ఎండుమిర్చి

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఎండుమిర్చి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఎండుమిర్చి ధర క్వింటా గరిష్ఠంగా రూ.10,350 పలికింది. ధరలు పెరుగుతాయని రైతులు ఆశించినా ధరలో మార్పులు లేకపోవడంతో నిరాశ చెందుతున్నారు. చాలా మంది రైతులు ఏసీ గోడౌన్లు లభించక వచ్చిన ధరకే పంటను విక్రయించుకుంటున్నారు. కనీసం కోత, రవాణా ఖర్చులు కూడా రావడం లేదని మిర్చి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం మార్కెట్‌కు 2,508 బస్తాల ఎండుమిర్చి విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర క్వింటా రూ.2,066, గరిష్ఠ ధర రూ.10,350, సగటున రూ.7,869 పలికింది.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతోపాటు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే బాధ్యత బీజేపీ ప్రజా ప్రతినిధులు తీసుకుంటారని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీలో కూటమి బలంగా ఉన్నా మండలిలో వైసీపీకి మెజారిటీ వల్ల కొన్ని ఆటంకాలు ఎదురవుతున్నాయని అన్నారు. తాజాగా టీడీపీ, జనసేన, బీజేపీ నుంచి ఐదుగురు సభ్యులు మండలిలో కూటమి ప్రభుత్వం తరపున చేరడంతో బలం పెరిగిందన్నారు. బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు త్రికరణ శుద్ధితో ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పల్లెల్లో కొళాయిలు ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వంలో జల్‌జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి కొళాయి నీరిస్తూ పవన్ కల్యాణ్ పేదల దాహార్తి తీరుస్తున్నారని కొనియాడారు. ఎమ్మెల్సీగా తనను ఎంపిక చేసిన బీజేపీ అధిష్ఠానం, చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు వీర్రాజు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

● ఫ్యాప్టో ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయుల నిరసన



ఫ్యాప్టో ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి మోకాళ్లపై నుంచుని నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఏళ్లతరబడి అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఫ్యాప్టో నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బుధవారం కలెక్టరేట్ ఎదుట ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి మోకాలిపై వినూత్న రీతిలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో కో చైర్మన్, కర్నూలు ఫ్యాప్టో ఇన్‌చార్జి ప్రకాశ్‌రావు మాట్లాడుతూ పీఆర్సీ కమిటీ వేసి వెంటనే 30 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపాధ్యాయ, ఉద్యోగులకు సంబంధించిన అన్ని బకాయిలు ఇస్తామని చెప్పి కొన్నింటిని మాత్రమే పరిష్కరించారన్నారు. మిగిలిన వాటిని కనీసం కార్యాచరణ కూడా ప్రకటించలేదని తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు సురేష్ కుమార్, ఏపీపీఎస్ (257)రాష్ట్ర నాయకులు రవికుమార్ మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఫ్యాప్టో చైర్మన్ సేవాలాల్ నాయక్ మాట్లాడుతూ కారుణ్య నియామకాలు చేపట్టాలని, చనిపోయిన ఉపాధ్యాయ, ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి మాట్లాడుతూ ఆంగ్ల మధ్యామంకు సమాంతరంగా తెలుగును కూడా కొనసాగించాలని తెలిపారు. ఏపీటీఎఫ్ (1938) జిల్లా అధ్యక్షుడు ఎస్.ఇస్మాయిల్ మాట్లాడుతూ 2022 నుంచి సరెండర్ లీవుల బకాయిలు ఉన్నాయనీ, వాటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ భాస్కర్, రవికుమార్, నవీన్ పాటిల్, జనార్దన్, ఎల్లప్ప, ఏపీటీఎఫ్ రామకృష్ణ, కోశాధికారి రంగన్న, ఆప్టా నాయకులు రాజాసాగర్, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకట్రాముడు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కరెకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప, లక్ష్మయ్య మాదన్న పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలు



బనగానపల్లె, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండంలోని ప్రముఖ శక్తిక్షేత్రమైన నందవరం చౌడేశ్వరీమాత ఉత్సవాల సందర్భంగా జ్యోతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో కామేశ్వరమ్మ తెలిపారు. ఆలయ మాజీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాల్లో భాగంగా 4వ రోజు చౌడేశ్వరీమాతకు ఉదయం అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన, పసుపు కుంకుమ, పట్టువస్త్రాల అలంకరణ, కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఏపీ నుంచే కాక తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతపురం ధర్మవరానికి చెందిన శ్రీ అభయ హస్త సేవా సమితి ఆధ్వర్యంలో అన్నమయ్య సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి భాస్కరయ్య ఆచారిచే చౌడేశ్వరీ అమ్మవారికి దిష్టిచుక్క పెట్టిన అనంతరం అర్ధరాత్రి 1 గంట నుంచి నందవరం జ్యోతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. బనగానపల్లె, నందివర్గం పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో భక్తులకు మజ్జిగ పాకెట్లు పంపిణీ చేశారు. ప్రతి 15 నిముషాలకు బనగానపల్లె మీదుగా కర్నూలు, అనంతపురం జిల్లాలనుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను నడుపుతున్నారు.

నందవరం చౌడేశ్వరిమాతను

దర్శించుకున్న మంత్రి సత్యకుమార్



నందవరం చౌడేశ్వరీ మాత ఆలయంలో మంత్రి సత్యకుమార్

బనగానపల్లె, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలంలోని ప్రముఖ శక్తిక్షేత్రమైన నందవరం చౌడేశ్వరీమాతను బుధవారం రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ బుధవా రం దర్శించుకున్నారు. ఆలయ ఈఓ కామేశ్వరమ్మ, ఆలయ మాజీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డితో పాటు ఆలయ పూజారులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. నందవరం చౌడేశ్వరీమాత జ్యోతి ఉత్సవాలకు హాజరైన మంత్రి అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చన చేయించారు. ఈ సందర్భంగా ఆలయ పెద్దలు, అర్చకులు మంత్రిని సత్కరించారు. మంత్రి వెంట బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకృష్ణయాదవ్, బీవీ.సుబ్బారెడ్డి, లింగన్న, హరికృష్ణగౌడ్, యా దగిరి, రవికుమార్, లోకేశ్వర్‌రెడ్డి, చిన్నయ్యయాదవ్, బాలవెంకటేశ్వర్లు, శరత్‌చంద్రకుమార్, చల్లా దామోదర్‌రెడ్డి, శ్రీరాములు, చిన్నమద్దిలేటి, శేషన్నయాదవ్, శ్రీనివాసులు, సుబ్బరాయుడు తదితరులు ఉన్నారు.

పశువుల కోసం నీటి తొట్టెలు : కలెక్టర్



దిన్నెదేవరపాడులో నీటి తొట్టె నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో పశువుల దాహం తీర్చిందేందుకు దాదాపు 300 నీటి తొట్టెలను నిర్మిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. కర్నూలు మండలంలోని దిన్నెదేవరపాడు గ్రామ శివారులో పశువులకు నీటి తొట్టె నిర్మాణానికి బుధవారం కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి భూమి పూజ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఒక్కొక్క నీటి తొట్టెలకు రూ. 34వేలు ఖర్చు అవుతుందని చెప్పారు. ఉపాధి హామీ పథకం నిధులతో వీటిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 10వ తేది లోపు నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. వేసవిలో నీటితొట్టెలను పశువులకు సంపూర్ణంగా వినియోగించుకొనే విధంగా పనులు చేపట్టాలని డ్వామా పీడీకి సూచించారు. ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ ఉపాధి పథకం కింద సీసీం రోడ్లు, నీటి సంరక్షణ పనులతో పాటు వేసవికాలంలో మూగజీవాలకు దాహార్తి తీర్చుకునేందుకు ప్రభుత్వం నీటితొట్టెలను నిర్మించడం సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో కర్నూలు రూరల్ తహసీల్దార్ వెంకట రమేష్‌బాబు, డ్వామా పీడీ రమణయ్య, ఎంపీడీవో రఘునాథ్, సర్పంచ్ మాధవస్వామి, పంచాయతీ కార్యదర్శి జాకీర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కర్నూలుకు మాజీ సీఎం జగన్



కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం కర్నూలుకు రానున్నారు. నగర శివారులోని జీఆర్‌సీ ఫంక్షన్ హాల్‌లో కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి కుమార్తె వివాహానికి ఆయన హాజరవుతారని వైసీపీ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. ఉదయం 9:30 గంటలకు తాడేపల్లి నుంచి హెలీకాఫ్టర్‌లో ద్వారా బయలుదేరి నగరంలోని మైపర్ కళాశాల మైదానంలో ల్యాండ్ అవుతారు. అక్కడి నుంచి జీఆర్‌సీ ఫంక్షన్ హాల్‌కు వెళ్లి వధూవరులను ఆశీర్వదించి తిరిగి తాడేపల్లికి చేరుకుంటారు.



అవ్వకు స్వర్ణ కిరీటం

ఆదోని టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆదోని పట్టణ ప్రజలు తమ ఇంటి ఇలవేల్పుగా భావించే మహాయోగి లక్ష్మమ్మ అవ్వకు అలంకరించేందుకు ఆలయ నిర్వాహకులు 1.3 కిలోల బరువైన బంగారు కిరీటాన్ని తయారు చేయించారు. రూ.కోటి ఖర్చుతో ఈ విగ్రహాన్ని తయారు చేయించినట్లు ఆలయ చైర్మన్ రాచోటి రామయ్య బుధవారం వెల్లడించారు. కిరీటాన్ని అందంగా తయారు చేయడంలో సహకరించిన జీఆర్‌టీ జ్యూవెల్లర్స్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ స్వర్ణ కిరీటాన్ని 93వ రథోత్సవం రోజున అవ్వకు అలంకరించనున్నట్లు వెల్లడించారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో హైకోర్టు రిజిస్ట్రార్లు



మహానందిలో హైకోర్టు రిజిస్ట్రార్లు

మహానంది, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో బుధవారం సాయంత్రం ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్లు నరసింహ ఆచారి, హరినాథ్ కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ ధ్వజస్తంభం వద్ద టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పసుపుల సుబ్బారెడ్డి స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు అభిషేకార్చనలు నిర్వహించారు. వీరితో పాటు విశ్రాంత రిజిస్ట్రార్ టి. వేణుగోపాల్‌రావు పాల్గొనగా ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మంటపంలో వీరిని ఆలయ వేద పండితులు ఆశీర్వదించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శాలువాతో సన్మానించి ప్రసాదాలు అందజేశారు.



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి

వన్ స్టాప్ కేంద్రం తనిఖీ

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో ఉన్న దిశా వన్ స్టాప్ సెంటర్, మహిళా ప్రాంగణం (శక్తిసదన్)ను బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి పరిశీలించారు. కార్యాలయానికి సంబంధించిన రిజిస్టర్లను తనిఖీ చేసి వాటిని సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అక్కడి సౌకర్యాలు, పరిశుభ్రతను పరిశీలించారు. సదస్సులో అక్కడ ఉన్న వారికి లీగల్ సర్వీసెస్ యాక్టు 1987 ద్వారా ఉచిత న్యాయ సహాయంను పొందడానికి అర్హులని తెలిపారు.

బీటీ నాయుడు అను నేను..

(5వ పేజీ తరువాయి)

మర్యాదపూర్వకంగా కలిశారు. శాసన మండలి ఆవరణలో టీడీపీ సీనియర్ నాయకులు కె.ఉమాపతినాయుడు, హల్వి ఉలిగయ్య, కోసిగి ముత్తురెడ్డి, రామిరెడ్డి తదితరులు బీటీ నాయుడుకు అభినందనలు తెలిపారు.

● **విశ్వసనీయతకు మరో అవకాశం**

ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా 2019 మార్చిలో బీటీ నాయుడుకు టీడీపీ అధినేత చంద్రబాబు తొలిసారిగా అవకాశం ఇచ్చారు. రాయలసీమ జిల్లాల్లో బలమైన వాల్మీకి సామాజికవర్గానికి చెందిన బీటీ నాయుడు 1994లో నాటి ఆదోని ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వం తీసుకున్న బీటీ నాయుడు లా వృత్తికి పూర్తిగా స్వస్తి చెప్పి రాజకీయాల్లో అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, ఉమ్మడి రాష్ట్రంలో వివిధ జిల్లాల పరిశీలకుడిగా పని చేయడమే కాక.. 2009, 2014లో రెండు పర్యాయాలు కర్నూలు పార్లమెంట్ స్థానం నుంచి టీడీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అధినేత చంద్రబాబుకు విశ్వసనీయత వల్లే 2019 మార్చిలో తొలిసారిగా శాసనమండలిలో అడుగుపెట్టారు. మళ్లీ ఇప్పుడు చంద్రబాబు ఆయనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు.

కార్యకర్తలను అక్కున చేర్చుకునే పార్టీ: బీటీ నాయుడు, ఎమ్మెల్సీ:

మా అధినేత, సీఎం చంద్రబాబు, యువనేత, మంత్రి నారా లోకేశ్‌లు పని చేసే కార్యకర్తలను అక్కున చేర్చుకుంటారు. రాజకీయంగా మంచి అవకాశాలు ఇస్తారు. అందుకు నేనే ఓ ఉదాహరణ. అత్యంత వెనుకబడిన కోసిగి మండలంలో ఓ మారుమూల గ్రామానికి చెందిన బీసీ సామాజికవర్గానికి చెందిన నాకు రెండో పర్యాయం ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. వారి రుణం ఈ జన్మలో తీర్చుకోలేనిది. టీడీపీ అంటేనే బడుగు బలహీనవర్గాల పార్టీ. పల్లె నుంచి ఢిల్లీ వరకు కష్టపడి పని చేసే వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుంది. ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మండలిలో బీసీ, ఎస్సీ ఎస్టీల గొంతుక అవుతాను. రాయలసీమ సమస్యలపై గళం వినిపిస్తా. ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు



టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్సీ బీటీ నాయుడు



ఎమ్మెల్సీ బీటీ నాయుడును అభినందిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, విప్ కాలువ శ్రీనివాసులు, తిక్కారెడ్డి తదితరులు



బీటీ నాయుడుతో మంత్రాలయం టీడీపీ నాయకులు

టీసీసీ శిక్షణకు దరఖాస్తులు

• ఏప్రిల్ 25లోపు దరఖాస్తు చేసుకోవాలి : డీఈవో

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు(టీసీసీ) 42 రోజుల కోర్సుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో శామ్యూల్ పాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 1 నుంచి జూన్ 11వ తేదీ వరకు విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కడప, అనంతపురం జిల్లా కేంద్రాల్లో శిక్షణా తరగతులు కొనసాగుతాయన్నారు. ఏప్రిల్ 25వ తేదీలోగా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవడానికి చివరి గడువు అన్నారు. 2025 సంవత్సరం మే నెల ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండి 45 సంవత్సరాలోపు వయసు ఉన్న వారు అర్హులు అన్నారు. పదో తరగతి పాసై టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు లోయర్ పూర్తి చేసి ఉండాల న్నారు. ఒకేషనల్ కోర్సు పూర్తి చేసిన వారు అర్హులన్నారు. మే ఒకటో తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని డీఈవో వెల్లడించారు.

అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్లు అందజేత



సర్టిఫికెట్లను అందిస్తున్న నర్సింగ్ సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్, ఏఎన్ఎం అప్రెంటిస్‌షిప్ పూర్తి చేసుకున్న విద్యార్థినులకు నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్పీ సావిత్రీబాయి సర్టిఫికెట్లను అందజేశారు. ఏఎన్ఎం కోర్సు తర్వాత ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో 1 సంవత్సరం అప్రెంటిస్‌షిప్ పూర్తి చేసిన వివిధ కాలేజీలకు చెందిన 40 మంది ఏఎన్ఎంలకు సర్టిఫికెట్లు పంపిణీ చేసినట్లు నర్సింగ్ సూపరింటెండెంట్ తెలిపారు. కార్యక్రమంలో గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ జి.విమలమ్మ పాల్గొన్నారు.

మత్స్యకారులకు అవగాహన

• మత్స్య శాఖ జేడీ ఏవీ రాఘవరెడ్డి



మాట్లాడుతున్న జేడీ రాఘవరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు

నందికొట్కూరు రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అలివి వలలు వినియోగించి చేపలు పడితే మత్స్యకారుల లైసెన్స్‌లను రద్దు చేసి చర్యలు తీసుకుంటామని నంద్యాల ఫిషరీష్ జేడీ ఏవీ రాఘవరెడ్డి, నందికొట్కూరు తహసీల్దార్ శ్రీనివాసులు హెచ్చరించారు. నందికొట్కూరులోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం మత్స్యకారులతో సమావేశం నిర్వహించారు. 100 గ్రాముల చేప పిల్లలను కూడా పట్టివేస్తే ఎలా? అని, భవిష్యత్తులో చేపల ఉత్పత్తి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. ఈ సంవత్సరం దాదాపుగా 17 నుంచి 20 లక్షల చేప పిల్లలను నదిలో వదిలామని తెలిపారు. కృష్ణానది పరివాహక ప్రాంతం లో దాదాపుగా 4 వేల మత్స్యకార కుటుంబాలు చేపల వేటపై ఆధార పడి జీవిస్తున్నాయని చెప్పారు. అందుకే ప్రభుత్వం వారిని దృష్టిలో ఉం చుకొని మత్స్య సంపద అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటుందని అన్నారు. అయితే కొందరు అలివి వలలు వినియోగించి నష్టం కలిగిస్తు న్నారని చెప్పారు. కార్యక్రమంలో ఫిషరీష్ ఏడీ శ్యామల, ఎఫ్‌డీవో భరత్‌లాల్, డీటీ సత్యనారాయణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

పొగాకు దగ్ధం




దగ్ధమైన పొగాకు

బండిఆత్మకూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతజూటూరు గ్రామానికి చెందిన అబ్దుల్లా అనే రైతుకు చెందిన పొగాకు దగ్ధమైంది. కొద్ది రోజులుగా పొగాకు విడిచి షెడ్డులో తోరణాలు కట్టి పొగ కూలీలతో వేయిస్తున్నాడు. అయితే బుధవారం మధ్యాహ్నాం షెడ్డులో మంటలు చెలరేగి దిగుబడి మొత్తం బూడిదైపోయింది. నంద్యాల అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరి మంటలను పక్క షెడ్లకు వ్యాపించకుండా పూర్తిగా ఆర్పివేశారు. ఏఎ్‌ఐ అక్బర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. రూ.6 లక్షలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

కుందూ నదిలో పడి వ్యక్తి మృతి

కోవెలకుంట్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కుందూ నదిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం కోవెలకుంట్ల పట్టణంలో చోటు చేసుకుంది. సీఐ హనుమంతనాయక్ తెలిపిన వివరాలివీ.. పట్టణంలోని ఎల్ఎం కాంపౌండుకు చెందిన గోగు చెన్నయ్య (52) ఆర్టీసీలో అసిస్టెంటు మెకానిక్‌గా పనిచేస్తుండేవారు. అప్పుడప్పుడూ కుందూనది వద్ద ఉన్న ఆశ్రమానికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేవారు. అందులో భాగంగా ఆదివారం ఇంటి వద్ద నుంచి బయల్దేరి కుందూనది వద్ద ఉన్న ఆశ్రమం వద్దకు వెళ్లి అక్కడ నుంచి కుందూలో ఈత కొట్టేందుకు దిగి ప్రమాదవశాత్తు పడి చనిపోయారు. బుధవారం మృతదేహం నదిలో కనిపించింది. సీఐ ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితి సమీక్షించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. చెన్నయ్య భార్య సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కార్లు ఢీ.. ఐదుగురికి గాయాలు



ధ్వంసమైన కార్లు


బేతంచెర్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నంద్యాల రహదారిలోని బుగ్గానపల్లె రైల్వేస్టేషన్ సమీ పంలో ఎదురెదురుగా వచ్చే రెండు కార్లు బుధవారం సాయంత్రం ఢీకొన్నాయి. ముగ్గురికి తీవ్రగాయాలు కాగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాలివీ.. పాణ్యం మండలం కందికాయ పల్లె గ్రామం వద్ద జరిగే సోలార్ పనులకు వెళ్లి జాఫర్, జునాద్, షాహీల్ వస్తున్న కారును కర్నూలు వైపు మోహన్, మధు వెళ్తున్న మరో కారు ఢీకొట్టడంతో జాఫర్, జునాద్, మధుకు తీవ్ర గాయాలు కాగా, మోహన్, షాహీల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విహారం.. విషాదం..

• తుంగభద్ర నదిలో తండ్రి, ఇద్దరు కుమారులు మృతి

• సుంకేసులలో దుర్ఘటన

ఫైజాన్ మృతదేహం



సులేమాన్, ఫర్హాన్ మృతదేహాలు

గూడూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరానికి చెందిన ఓ కుటుంబంలో విహారయాత్ర తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. రంజాన్ పండుగ ముగిసిన సందర్భంగా విహారయాత్రకు వెళ్లిన కుటుంబంలో అంతులేని విషాదం నెలకొంది. కర్నూలు మండల పరిధిలోని సుంకేసుల డ్యాం వద్ద తుంగభద్ర నదిలో మునిగి సులేమాన్ (47), ఆయన ఇద్దరు కొడుకులు ఫర్హాన్ (13), ఫైజాన్ (9) మృత్యువాత పడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలు లక్ష్మీనగర్‌కు చెందిన సులేమాన్ రాజ్‌విహార్ సమీపంలో ఓ దుస్తుల దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. భార్య నస్రీనా బేగం శకుంతల కల్యాణ మండపం వద్ద మరో వస్త్ర దుకాణం నిర్వహిస్తు న్నారు. వీరికి కుమార్తె సోఫియా, ఇద్దరు కొడుకులు ఫర్హాన్, ఫైజాన్‌లు సంతానం. తమకు ఉన్నంతలో ముగ్గురు పిల్లలను ఓ ప్రైవేటు పాఠశాలలో చదివిస్తు న్నారు. సోఫియా పదో తరగతి పరీక్షలు రాసింది. పెద్ద కొడుకు ఫర్హాన్ 7వ తరగతి చదవు తుండగా రెండో కుమారుడు ఫైజాన్ 2వ తరగతి చదువుతున్నాడు. రంజాన్ పర్వదినం ముగియడంతో పాటు మరోవైపు కుమార్తె పదో తరగతి పరీక్షలు పూర్తి కావడంతో సులేమాన్, నస్రీన్ బేగం తమ ముగ్గురు పిల్లలతో కలిసి సుంకేసుల డ్యాం వద్దకు విహార యాత్రకు వెళ్లారు. అప్పటికే డ్యాం వద్ద వీరి బంధువులు కూడా ఉన్నారు. అందరు కలిసి ఆనందంగా గడుపుతుండగా.. సులేమాన్ తన ఇద్దరు పిల్లలతో కలిసి ఈత కొట్టేందుకు సరదాగా నదిలోకి దిగారు. ప్రమాదవశాత్తు నీటిలో వీరు మునిగిపోయారు. లోతును అంచనా వేయకపోవడంతో ముగ్గురూ నీటిలో మునిగిపోయారు. స్థానికులు అప్రమత్తమై వారిని రక్షించేందుకు నదిలోకి దిగినా అప్పటికే వారు నదిలో గల్లంతయ్యారు. గంటపాటు గాలించి తండ్రీ కుమారుల మృతదేహాలను బయటకు తీశారు. సమాచారం తెలుసుకున్న వెంటనే తెలంగాణ రాష్ట్రం రాజోలి పోలీసులు, కర్నూలు జిల్లా గూడూరు మండల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. రాజోలి పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలిం చారు. బంధువుల ఫిర్యాదు మేరకు గూడూరు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఒక్కసారిగా కుటుంబంలో భర్త, ఇద్దరు పిల్లలు చనిపోవడంతో తల్లి నస్రీన్ బేగం రోదనలు మిన్నంటాయి.

కర్నూలు మార్కెట్ కమిటీకి
అంచనాకు మించి ఆదాయం

• కందులు, ఉల్లి వాము నుంచి భారీగా సెస్సు వసూలు • లక్ష్యం రూ.7.60 కోట్లు.. వచ్చింది రూ.8.40 కోట్లు



యార్డుకు పెద్ద మొత్తంలో ఆదాయాన్ని సమకూర్చిన కందులు

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎక్కువ పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరుగుతున్న మార్కెట్ కమిటీల్లో కర్నూలుకు మొదటి స్థానం లభించడంతో పాటు లక్ష్యానికి మించి సెస్సు వసూళ్లు జరిగాయి. మార్చి నెలాఖరుకు కర్నూలు మార్కెట్ కమిటి నుంచి రూ.7.60 కోట్ల సెస్సును సాధించాలని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత ఆదేశించారు. ఈ లక్ష్యాన్ని మించి రూ.కోటి అదనంగా రూ.8.40 కోట్లు సెస్సును సాధించి కర్నూలు మార్కెట్ కమిటి అధికారులు, సిబ్బంది ప్రభుత్వంతో శభాష్ అనిపించుకున్నారు. సెస్సు ఆదాయాన్ని ఎక్కువ మొత్తంలో రాబట్టేందుకు రైతులు తెచ్చిన కందులతో పాటు వేరుశనగ, వాము, ఉల్లి తదితర పంటలు ఎక్కువ మొత్తంలో రైతులు విక్రయానికి తెచ్చినందువల్లే సాధ్యమైందని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. బుధవారం కర్నూలు మార్కెట్ కమిటి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మార్చి నెలాఖరుకు కర్నూలు మార్కెట్ కమిటి సాధించిన సెస్సు ఆదాయ వివరాలను వివరించారు. వేరుశనగ నుంచి రూ.1.17 కోట్లు, కందుల నుంచి రూ.1.93 కోట్లు, వాము నుంచి రూ.1.19 కోట్లు, ఉల్లి నుంచి రూ.1.61 కోట్లు, ఎండుమిర్చి నుంచి రూ.65 లక్షలు, ఇతర మార్గాల ద్వారా రూ.1.16 కోట్లు మొత్తం రూ.8.40 కోట్లు సెస్సును సాధించామని సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. ధాన్యం నుంచి రూ.2 లక్షలు, బియ్యం నుంచి రూ.11 లక్షలు, పొద్దుతిరుగుడు నుంచి రూ.2.77 లక్షలు, పత్తి నుంచి రూ.1.54లక్షలు, శనగల నుంచి రూ.8.15 లక్షలు, ఆముదం నుంచి రూ.35.38 లక్షలు, జొన్నల నుంచి రూ.19వేలు, మొక్కజొన్న నుంచి రూ.6.09 లక్షలు ఆదాయం చేకూరినట్లు తెలిపారు. లక్ష్యానికి మించి ఆదాయాన్ని సాధించడంలో అధికారులు, సూపర్‌వైజర్లు, అసిస్టెంట్ సెక్రటరీలు ఎంతో శ్రమించారన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, నాగేష్, శివన్న, అకౌంటెంట్ కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఆదోని బార్ అసోసియేషన్ ఎన్నికలు

• అధ్యక్షుడిగా శ్రీరాములు విజయం, కార్యదర్శిగా జీవన్‌సింగ్



విజేతలు శ్రీరాములు, జీవన్‌సింగ్, వెంకటేశ్వర్లు, రాజారత్నం

ఆదోని, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బార్ అసోసియేషన్ ఎన్నికల్లో న్యాయవాది శ్రీరాములు విజయం సాధించారు. బుధవారం అసోసియేషన్ కార్యాలయంలో ఎన్నికల అధికారి భాస్కర్ రెడ్డి పర్యవేక్షణలో దయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష పదవికి మధుసూధన్ రెడ్డి, శ్రీరాములు పోటీపడ్డారు. మొత్తం 303 మంది ఓటర్లు ఉండగా, 292 మంది ఓటు వేశారు. 95 శాతం పోలింగ్ నమోదైంది. గతంలో ఎన్నడూ ఇంత పోలింగ్ శాతం నమోదు కాలేదని న్యాయవాదులు చర్చించుకున్నారు. 6 గంటలకు ఓట్లను లెక్కించారు. శ్రీరాములుకు 192 ఓట్లు రాగా, మధుసూధన్ రెడ్డికి 91 ఓట్లు వచ్చాయి. దీంతో 101 ఓట్లతో శ్రీరాములు అధ్యక్షుడిగా ఘనవిజయం సాధించారు. ఉపాధ్యక్ష పదవికి 303 మంది సభ్యులకు గానూ, 290 మంది న్యాయవాదులు ఓటు హక్కును వినియోగించుకోగా, 4 ఓట్లు చెల్లలేదు. అనంతరం ఓట్లను లెక్కించారు. జె.వెంకటేశ్వర్లుకు 206 ఓట్లు రాగా, లోకేష్‌కు 80 ఓట్లు వచ్చాయి. 4 ఓట్లు చెలలేదు. 126 ఓట్లతో వెంకటేశ్వర్లు ఉపాధ్యక్షుడిగా విజయం సాధించారు. కార్యదర్శిగా జీవన్‌సింగ్‌కు 197 ఓట్లు రాగా, నెట్టికంఠయ్యకు 88 ఓట్లు రాగా, 5 ఓట్లు చెల్లలేదు. 109 ఓట్లతో కార్యదర్శిగా జీవన్‌సింగ్ ఘనవిజయం సాధించారు. సంయుక్త కార్యదరిగా పోటీపడిన ఖలందర్‌కు 118 ఓట్లు రాగా, రాజారత్నంకు 167 ఓట్లు రాగా, 5 ఓట్లు చెల్లలేదు. 49 ఓట్లతో రాజారత్నం విజయం సాధించారు. సీనియర్, జూనియర్ న్యాయవాదులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. విజేతలను న్యాయవాదులు సన్మానించారు. నూతన అధ్యక్షుడు శ్రీరాములు తనను బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నుకున్న న్యాయవాదులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో అసోసియేషన్ అభివృద్ధికి పాటుపడతానన్నారు. ఎన్నికల సహాయ అధికారులుగా భాస్కర్ రెడ్డి, సోమశేఖర్, హనుమేష్ వ్యవహరించారు. టూటౌన్ ఎస్సై రామ్‌నాథ్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పేకాట స్థావరాలపై దాడులు

• 14 మంది అరెస్టు.. నగదు స్వాధీనం

కోవెలకుంట్ల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు చేసి 14 మందిని అరెస్టు చేసి రూ.48వేలు నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ హనుమంతనాయక్ తెలిపారు. వివరాలివీ.. పట్టణంలో కొందరు వ్యక్తులు పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి ఒకచోట దాడి చేయగా, 9మంది అదుపులోకి తీసుకుని రూ.36వేలు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే పట్టణంలో మరో చోట పేకాట స్థావరంపై దాడి చేయగా ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.12 వేలు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

ఉపాధి పనుల్లో అవినీతి

• కల్లూరులో 17వ విడత సామాజిక తనిఖీ
• వైసీపీ ప్రభుత్వంలో ఫీల్డ్ అసిస్టెంట్ల అక్రమాలు
• రూ.5.8 లక్షల మేర అవినీతి జరిగినట్లు నిర్ధారణ
• రికవరీకి ఉన్నతాధికారుల ఆదేశం



సామాజిక తనిఖీలో పాల్గొన్న డ్వామా పీడీ వెంకటరణయ్య

కల్లూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం 17వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. డ్వామా పీడీ వెంకటర మణయ్య, ఏపీడీ మాధవీలత, విజిలెన్స్ అధికారులు లోకేష్, ఆదినారాయణ హాజరయ్యారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు మండలంలో చేపట్టిన ఉపాధిహామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీలో గుర్తించిన అక్రమాలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఉపాధిహామీ పథకం పనులకు చెందిన రూ. 7.47 కోట్లు, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన రూ. 3.10 కోట్లు, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో చేపట్టిన రూ. 63.17 లక్షల పనులపై డ్వామా పీడీ వెంకటరమణయ్య ఆధ్వర్యంలో ఉపాధిహామీ సిబ్బందితో చర్చించారు. అందులో భాగంగా అన్ని గ్రామ పంచాయతీల్లో కలిపి బినామీ పేర్ల నమోదు, కొలతల్లో తేడాలపై రూ.5.39 లక్షల మేర రికవరీకి డ్వామా పీడీ ఆదేశించారు. అలాగే రూ.41 వేలు జరిమానా విధించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉపాధిహామీ పనుల్లో అవకతవకలకు పాల్పడిన వారెవరైనా ఉపేక్షించబోమని పీడీ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.నాగేశాచలరెడ్డి, పీఆర్ ఏఈ అచ్యుతానందరెడ్డి, ఎస్ఆర్‌పీ విజయభాష్కర్, ఏపీవో మద్దీశ్వరమ్మ, ఎఫ్ఏలు, టీఏలు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో ఫీల్డ్ అసిస్టెంట్ల అక్రమాలు

గత వైసీపీ ప్రభుత్వంలో ఫీల్డ్ అసిస్టెంట్లు పెద్దఎత్తున అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈమేరకు డ్వామా పీడీకి ఆయా గ్రామాల నాయకులు ప్రజలు ఫీల్డ్ అసిస్టెంట్ల అవినీతి అక్రమాలపై వినతిపత్రాలు అందించారు. బస్తిపాడు, నాయకల్లు, కొంగనపాడు, సల్కాపురం, పెద్దకొట్టాల గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లపై ఫిర్యాదులు వచ్చాయి. విచారణ చేపట్టి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన మండల, జిల్లా ఉన్నతాధికారులు ఆదిశగా చర్యలు తీసుకోవడంలో విఫలం అయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గుట్టు చప్పుడు కాకుండా ఐదు గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు విధులకు రాజీనామా చేయగా వాటిని మండలం ఎంపీడీవో, డ్వామా అధికారులు తొలగించినట్లు సమాచారం. అవినీతి అక్రమాలకు పాల్పడిన ఫీల్ అసిస్టెంట్లపై ఎలాంటి చర్యలు లేకుండానే వైదొలిగారు. అందులో అధికారుల పాత్ర ఏమిటనేది ప్రశ్నగా మిగిలిపోయింది. అదేవిధంగా ఎ.గోకులపాడు, ఉలిందకొండ ఫీల్డ్ అసిస్టెంట్లు అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని గ్రామ ప్రజలు డ్వామా పీడీకి ఫిర్యాదు చేశారు.

ఉలిందకొండ ఫీల్డ్ అసిస్టెంట్‌ను కొనసాగించాలి: సీపీఎం

గత 15 సంవత్సరాలుగా ఉపాధిహామీ పనులను లక్ష్యం మేరకు నిర్వహిస్తూ విధులు చేపడుతున్న ఉలిందకొండ ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.శాంతకుమారిని కొనసాగించాలని సీపీఎం మండల కార్యదర్శి కృష్ణ, మధు డిమాండ్ చేశారు. ఆమె ఎలాంటి ఆరోపణలు లేకపోయినా నాయకుల మెప్పుకోసం తొలగిస్తే చూస్తూ ఊరుకోబోమని అన్నారు.

గాంధీనగర్‌లో చైన్ స్నాచింగ్..

• వృద్ధురాలి మెడలో బలవంతంగా బంగారు గొలుసును లాక్కెళ్లిన దుండగుడు
• పారిపోతూ కిందపడిన దుండగుడు • చికిత్స పొందుతూ మృతి





దొంగతనం జరిగిన ప్రాంతం, ఇన్‌సెట్‌లో బాధితురాలు

ఎమ్మిగనూరు , ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీనగర్‌లో జరిగిన చైన్ స్నాచింగ్ కలకలంరేపింది. వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లిన దుండగుడి కథ విషాదంగా ముగిసింది. పట్టణానికి చెందిన రాఘవేంద్ర అనే వ్యక్తి బస్టాండ్ ప్రాంతంలో బార్‌బార్ షాపులో పనిచేస్తున్నాడు. గాంధీనగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో మొదటి అంతస్తులో తనకు పరిచయం ఉన్న వృద్ధదంపతులు ఇంటిలోకి తెల్లవారుజామునే వెళ్లాడు. వృద్ధురాలు రమణమ్మ తెల్లవారు జామున బాత్‌రూంలో నుంచి బయటకు వస్తుండగా ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కొన్ని ఒక్కసారిగా ఆమెను బలంగా నెట్టివేశాడు. ఈ క్రమంలో బాధితురాలు రమణమ్మకు ముఖంపైన, చేతులు, కాలికి స్వల్పగాయాలయ్యాయి. దీంతో బాధిత వృద్ధురాలు కిందపడి గట్టిగా కేకలు వేసింది. బంగారు గొలుసును లాక్కొన్ని పారిపోయే క్రమంలో దుండగుడు రాఘవేంద్ర పై అంతస్తు నుంచి కిందకు పడిపోయాడు. బాధితురాలి బంధువులు, పోలీసు లకు సమాచారం అందిండంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అలాగే దుండగుడు రాఘవేంద్ర బంధు వులు కూడా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తీవ్ర గాయాల పాలైన రాఘవేంద్రను చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని తిరిగి ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు: ఎమ్మెల్యే



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

కొత్తపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దళారుల మాటలు నమ్మి ధాన్యాన్ని విక్రయించి రైతులు మోసపోవద్దని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య రైతులకు సూచించారు. బుధవారం కొత్తపల్లి ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో ఎంపీడీవో మేరీ పర్యవేక్షణలో మార్క్‌ఫెడ్ డీఎం హరినాథ రెడ్డి, ఏడీఏ ఆంజనేయ, మార్క్‌ఫెడ్ బ్రాంచ్ మేనేజర్ నవీన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్వింటం కందులు రూ.7,550, శనగ రూ.5,650, మినుములు 7,400 చొప్పున మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. మండలంలోని ఆయా గ్రామాల రైతు సేవా కేంద్రాల వద్ద రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఏవో మహేష్, గోపాల్ రెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

గ్రామాలు అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే జయసూర్య చెప్పారు. కొత్తపల్లి ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీడీవో మేరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. తహసీల్దార్ ఉమారాణి, జడ్పీటీసీ సోముల సుధాకర్ రెడ్డి, మండల సర్వేయర్ అనూష, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గడవులోపు ఇళ్లు నిర్మించుకోవాలి: పీడీ



లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ హరిగోపాల్

ఆత్మకూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో గృహాలు మంజూరై నేటికీ ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాని లబ్ధిదారులు ప్రభుత్వం ఇస్తున్న అదనపు ఆర్థిక సాయాన్ని సద్వినియోగించుకుని నిర్ణయించిన గడువులోగా పూర్తి చేసుకోవాలని హౌసింగ్ పీడీ హరిగోపాల్ సూచించారు. ఆత్మకూరులో గృహాలు మంజూరైన లబ్ధిదారుల ఇళ్లకు వద్దకు వెళ్లి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని బుధవారం అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయంలో గృహ నిర్మాణ పథకం మంజూరై నేటికి పూర్తి కాకుండా ఉన్న బేస్ లెవల్, రూఫ్ లెవల్, స్లాబ్ లెవర్ గృహాలకు సంబంధించి బీసీ, ఎస్సీ, ఎస్టీ, చెంచు గిరిజన లబ్ధిదారులకు అదనంగా ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు వివరించారు. బీసీ, ఎస్సీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలతో పాటు చెంచు గిరిజనులకు రూ.లక్ష చొప్పున అదనపు సాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ లెక్కన ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో 1307, మండలంలో 553 గృహాలు ఉన్నట్లు చెప్పారు. అర్హులు మే 31వ తేదిలోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుంటే అదనపు ఆర్థిక సాయం అందతుందని వెల్లడించారు. మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, డీఈ నాగరాజు, ఏఈ ఉమామహేశ్వరరెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు నాయక్, సుబ్బలక్ష్మమ్మ ఉన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ



ఆహారాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం నంద్యాల జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న భోజన నాణ్యతను అధికారులు వెంకటరాముడు, కాశీంవలి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆహార పదార్థాలను శాంపిళ్లను సేకరించి స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీకి పంపినట్లు అధికారులు తెలిపారు.

వెటర్నరీ అసిస్టెంట్‌కు పురస్కారం



అమరావతిలో పశుసంవర్థకశాఖ డైరెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వెటర్నరీ అసిస్టెంట్

బండిఆత్మకూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పశువర్థకశాఖలో వెటర్నరీ అసిస్టెంటుగా విధులు నిర్వహిస్తున్న జి.సాయిచంద్‌కు ఉగాది పురస్కారం దక్కింది. బండిఆత్మకూరు పశువైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న సాయిచంద్‌కు ప్రభుత్వం పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో 2025కు సంబంధించి అమరావతిలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది పురస్కారాన్ని ప్రదానం చేశారు. పశుసంవర్థకశాఖ సంచాలకుడు దామోదర్‌నాయుడు చేతుల మీదుగా పురస్కారం అందించారు. వెటర్నరీ అసిస్టెంట్‌కు సహచర సిబ్బంది అభినందనలు తెలిపారు.

రెండు రోజుల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి

మహానంది, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పురోగతి తక్కువగా ఉన్న మండలంలోని వ్యవసాయ సహాయకులు మరో రెండు రోజుల్లో వంద శాతం ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయాలని డీఏవో మురళీకృష్ణ ఆదేశించారు. బుధవారం మహానంది మండలం ఎం.తిమ్మాపురంలో మండలంలోని 11 రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులతో పాటు ఉద్యాన సహాయకులతో ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని రైతులకు వ్యవసాయశాఖ ద్వారా వచ్చే సంక్షేమ పథకాల గురించి అవగాహన మండల వ్యవసాయాధికారి బి. నాగేశ్వరరెడ్డి, ఏఈవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రసాభాసగా మున్సిపల్ ప్రత్యేక సమావేశం

- సీఎం పర్యటనకు సంబంధించి రూ.1. 42 కోట్లకు గానూ రూ.90 లక్షలకే ఆమోదం తెలిపిన వైసీపీ కౌన్సిలర్లు
- బాయ్ కాట్ చేసిన టీడీపీ కౌన్సిలర్లు

నంద్యాల మున్సిపాలిటీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పర్యటించనున్న నేపథ్యంలో బుధవారం నంద్యాల మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం కౌన్సిల్ హాల్‌లో ఏర్పాటు చేశారు. అయితే ఈ సమావేశం రసాభాసగా జరిగింది. సీఎం పర్యటనకు సంబంధించి రూ.1.42 కోట్లతో వివిధ అంశాలను కౌన్సిల్‌లో ప్రవేశ పెట్టారు. అయితే రూ.90 లక్షలు ఆమోదిస్తున్నట్లు చైర్‌పర్సన్ మాబున్నీసా ప్రకటించారు. ముఖ్యమంత్రి నంద్యాల పర్యటనకు సంబంధించిన బడ్జెట్‌ను వైసీపీ కౌన్సిలర్లు వ్యతిరేకించటం సిగ్గుచేటు అని టీడీపీ కౌన్సిలర్లు నాగార్జున, ఫ్లోర్ లీడర్ మహబూబ్ వలి, చెరకు శ్రీదేవి, జైనా బీ, శ్యాంసుదర్‌లాల్ కౌన్సిల్ సమావేశాన్ని బాయ్ కాట్ చేశారు. ముఖ్యమంత్రి పర్యటనకు కేటాయించిన బడ్జెట్‌లో కోత పెట్టడం సిగ్గు చేటని కౌన్సిలర్ శ్యాం సుందర్‌లాల్ ఘాటుగా వ్యాఖ్యానించారు. కౌన్సిల్ రగడ నేపథ్యంలో కమిషనర్ జోక్యం చేసుకుంటూ ముఖ్యమంత్రి పర్యటన ఖారురు కాలేదని, ఖారారైనప్పుడు మాత్రమే బడ్జెట్ కేటాయింపులను ఖర్చు చేస్తామని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ వైఎస్ చైర్మన్లు పంషావలి, గంగిశెట్టి శ్రీధర్, మున్సిపల్ అధికారులు కౌన్సిలర్లుపాల్గొన్నారు. అయితే వైసీపీకి సభ్యులు పలు అంశాలను తిరస్కరించడం వెనుక ఆ పార్టీకి చెందిన ఓ మాజీ ప్రజాప్రనిధి ఉన్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి.



నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ కౌన్సిలర్లు

సమయ పాలనపాటించని చైర్‌పర్సన్

ప్రజా పాలనలో అత్యంత కీలకమైన మున్సిపల్ కౌన్సిల్‌లో సమయపాలన మరిచారు. 11 గంటలకే కౌన్సిల్ ప్రత్యేక సమావేశానికి రావాల్సి ఉండగా చైర్‌పర్సన్ అర్ధగంట ఆలస్యంగా వచ్చారు. అయితే చైర్‌పర్సన్ ఆలస్యంగా రావడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూడిచర్ల, పారుమంచాల, జూపాడుబంగ్లా-2 గ్రామ సచివాలయాల పరిధిలో గురువారం ఆధార్ ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో గోపికృష్ణ తెలిపారు. ఈనెల 3 నుంచి 4వ తేదీ వరకు తూడిచర్ల గ్రామంలో, 3న పారుమంచాల, 4న జూపాడుబంగ్లా-2 సచివాలయాల్లో ఆధార్‌నమోదు కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, అంగన్‌వాడీ చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్ పరీక్షలు

పాణ్యం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ రెండో సెషన్ పరీక్షలు మొదటి రోజు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఈ పరీక్షల్లో ఉదయం 94 మందికి 85 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షలో 97 మందికి 92 మంది హాజరైనట్లు పరీక్షల కోఆర్డినేటర్ డాక్టర్ సుబ్బారెడ్డి తెలిపారు.

బకాయిలు చెల్లించాలి: ఫ్యాప్టో



డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యా, ఉద్యోగుల ఆర్థిక బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రాష్ట్ర పరిశీలకుడు జి.హృదయరాజు, ఫ్యాప్టో జిల్లా చైర్మన్ కేవీ శివయ్య డిమాండ్ చేశారు. నంద్యాల కలెక్టరేట్ ఎదుట ఫ్యాప్టో నాయకులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై నిరసన కార్యక్రమం చేపట్టారు. హృదయరాజు, శివయ్య మాట్లాడుతూ ఉద్యోగుల హక్కులను కాలరాసే ఏ ప్రభుత్వానికైనా పతనం తప్పదని హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను, ఉద్యోగులకు రావాల్సిన డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని, కమిషన్‌ను నియమించడం ఆలస్యమైతే వెంటనే 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మాధ్యమంతోపాటు సమాంతరంగా తెలుగు, ఉర్దూ మాధ్యమాలను కొనసాగించాలన్నారు. పంచాయతీరాజ్ యాజమాన్యంలో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను చేపట్టి ఆ కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీస్ రూల్స్‌కు సంబంధించిన 72, 73, 74జీవోలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్వో రామునాయక్‌కు ఫ్యాప్టో నాయకులు వినతిపత్రం అందించారు. ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ అబ్దుల్‌కలాం, కార్యవర్గ సభ్యులు వరప్రసాద్, మౌలాలి, శ్రీనివాసులు, కుమారి, కిశోర్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

గడివేముల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మూలపెద్దమ్మ ఆలయంలో బుధవారం చీఫ్ ఫెస్టివల్ అధికారి తిరుమల్‌రెడ్డి ఆధ్వర్యంలో బాలాజీ సేవా సమితి, ఆలయ సిబ్బంది హుండీ ఆదాయాన్ని లెక్కించారు. భక్తులు చెల్లించిన ముడుపులు లెక్కించగా శాశ్వత హుండీ ద్వారా రూ.4,53,448, తాత్కాలికంగా ఏర్పాటు చేసిన హుండీ ద్వార రూ.1,94,094, 1.630 గ్రాముల బంగారు, 11.390 గ్రాముల వెండి వచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి రామలింగారెడ్డి, ఈవోలు నాగప్రసాద్, అభిమన్యు, ఆలయ ఫెస్టివల్ కమిటీ సభ్యులు రమణారెడ్డి, నరేంద్రనాథ్‌రెడ్డి, ఆలయ సిబ్బంది రామసుబ్బయ్య పాల్గొన్నారు.

సాక్షి గణపతికి అభిషేకం

శ్రీశైలం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో లోకకళ్యాణం కోసం బుధవారం ఉదయం సాక్షి గణపతి స్వామికి విశేష అభిషేకం, పూజలు నిర్వహించారు. అభిషేకాన్ని పంచామృతాలతోనూ, పలుఫలోదకాలతోనూ, హరిద్రోదకం, కలశోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధ జలాలతో అభిషేకాన్ని జరిపి మహా మంగళ హారతులు సమర్పించారు.

- జ్వాలావీరభద్ర స్వామికి ప్రదోషకాలంలో విశేష అభిషేకం, పూజలు నిర్వహించింది. ఈ స్వామికి అఘోరవీరభద్రమూర్తి అని పేరు కూడా ఉంది. స్వామికి పంచామృతాలతోనూ, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో అభిషేకం నిర్వహించారు.

ఘనంగా వేణుగోపాల స్వామి రథోత్సవం

కొత్తపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్యాల గ్రామంలో వెలసిన లక్ష్మీ సమేత వేణుగోపాల స్వామి, పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలను పురస్కరించు కుని బుధవారం సాయంత్రం వేణుగోపాల స్వామి రథోత్సవం రమణీయంగా సాగింది. స్వామివారి రథోత్సవానికి ఆలయ ఈవో కార్తీక్, పురోహితులు సుబ్రహ్మణ్య శర్మ, ధర్మకర్తల మండలి సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రముఖుల సమక్షంలో ప్రత్యేక పూజలు చేసి గ్రామ పురవీదుల గుండా అశేష భక్తజనవాహిని మధ్య రథోత్సవాన్ని నిర్వహించారు.



దుద్యాలలో వేణుగోపాలస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న చంద్రమౌళీశ్వరరెడ్డి

మహానంది, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మసీదుపురం గ్రామంలో బుధవారం అట్టహాసంగా ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను మండల టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రమౌళీశ్వరరెడ్డి ప్రారంభించారు. గ్రామంలో యువత ఆధ్వర్యంలో 15 రోజులపాటు కొనసాగే ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలకు జిల్లా నలుమూలల నుండి 60 జట్టులు పోటీల్లో పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.50 వేలను కొర్రపోలు రుపేంద్రరెడ్డి, రెండో బహుమతి రూ.30 వేలను ఒంటెద్దు దినేష్‌కుమార్‌రెడ్డి, మూడో బహుమతి రూ.20 వేలను టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రమౌళీశ్వరరెడ్డి, నాలుగో బహుమతి రూ.10 వేలను ఒంటెద్దు షణ్ముఖరెడ్డి ప్రకటించినట్లు నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో ఒటెద్దు ప్రతాపరెడ్డి , రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీతోనే యాదవుల అభివృద్ధి'



ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న వెంకటేశ్వర్లు యాదవ్

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే యాదవుల సాధ్యమని యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్ అన్నారు. బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో నాగేంద్రగౌడు, కాగుల శంకర్, సంపత్‌కుమార్‌యాదవ్, నవీన్, శంకర్, చిన్న దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు: ఎస్పీ

పాములపాడు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారి తల్లిదండ్రులపై, వాహన యజమానులపై చర్యలు తప్పవని ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా హెచ్చరించారు. పాములపాడు పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం రికార్డులను పరిశీలించి పెండింగులో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగుతున్న వారిపై డ్రోన్‌లు వినియోగించి కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. హైవే పనులు జరుగుతుండడంతో ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు చెప్పారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచామని, గత ఏడాదికంటే ఈ ఏడాది జిల్లాలో క్రైం రేటు తగ్గిందని తెలిపారు. సీసీ కెమెరాలతో నిఘా ఉంచుతున్నామని చెప్పారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు పోలీసులు కూడా హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, లేదంటే పోలీసులకు జరిమానా విధించాలని సూచించారు. స్టేషన్ ఆవరణలో ఉన్న పోలీస్ క్వాటర్స్ శిధిలావస్థకుకు చేరుకున్నాయని ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. ఎస్ఐ సురేశ్‌కుమార్, పోలీసులు ఉన్నారు.

ఆత్మకూరు: ఆత్మకూరు పోలీసు స్టేషన్‌ను బుధవారం ఎస్పీ ఆధిరాజ్‌సింగ్ రాణా ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసుల పురోగతి గురించి అర్బన్ సీఐ రామును అడిగి తెలుసుకున్నారు. అలాగే వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను పరిశీలించి వాటి వివరాలను ఆరా తీశారు. అదేవిధంగా స్టేషన్‌లోని రిసెప్షన్‌ను పరిశీలించి తేదీల వారిగా ప్రజల నుంచి ఫిర్యాదులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలీసుస్టేషన్ పరిధిలో నమోదైన రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని సూచించారు. న్యాయస్థానాల్లోని ముఖ్యమైన కేసుల్లో నేరగాళ్లకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యంపై, సైబర్ మోసాల బారిన పడకుండా ప్రజలకు, క్రికెట్ బెట్టింగ్స్ మాదక ద్రవ్యాల వినియోగం తదితర అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడకుండా యువతకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని సూచించారు. ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ ఉన్నారు.



పాములపాడులో పోలీసులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ

పీహెచ్‌సీ తనిఖీ



రికార్డును పరిశీలిస్తున్న వైద్యాధికారి

మిడుతూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జోనల్ మలేరియా అధికారి లక్ష్మీనాయక్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, ల్యాబ్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం వైద్యాధికారి రాజును వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సీహెచ్‌వో రంగస్వామి, హెల్త్ సూపర్‌వైజర్ ఏసేపు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'మహా సభలను జయప్రదం చేయాలి'



పార్నపల్లెలో సీపీఎం జెండాను ఆవిష్కరిస్తున్న డేవిడ్

బండిఆత్మకూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని మధురైలో ఈనెల 6వ తేదీ వరకు జరిగే సీపీఎం అఖిల భారత 24వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు డేవిడ్, రత్నమయ్య పిలుపునిచ్చారు. మండలంలోని పార్నపల్లె గ్రామంలో బుధవారం పార్టీ పతాకాన్ని గ్రామశాఖ అధ్యక్షుడు రాజు ఆధ్వర్యాన డేవిడ్ ఎగుర వేశారు. 6వ తేది జరిగే భారీ బహిరంగ సభకు ప్రజలు, పార్టీ కార్యకర్తలు తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. సుబ్బరాయుడు, నాగరత్నం, పెద్దరాజు, నారాయణ, సునీల్ పాల్గొన్నారు

'ఆ బిల్లును ఉపసంహరించుకోవాలి'



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు నాగేశ్వరరావు

నందికొట్కూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని, వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగేశ్వరావు డిమాండ్ చేశారు. బుధవారం నందికొట్కూరు సీపీఎం కార్యాలయంలో సీపీఎం నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పూర్వం నుంచి కొంత మంది దాతలు సహకారంతో మసీదులకు ఇచ్చిన భూములను స్వాధీనం చేసుకోడానికి కేంద్రంలోని బీజేపీ ప్రయత్నం చేస్తోందని అన్నారు. ప్రతిపక్షాల అభిప్రాయాలను, సూచనలను పరిగణనలోకి తీసుకోకుండా నేడు వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లు ముందుకు తీసుకురావడం విచారకరమని అన్నారు. ఈ బిల్లుపై టీడీపీ, జనసేన, వైసీపీ తమ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు గోపాలకృష్ణ, ఉస్మాన్ బాషా, బాలస్వామి, అబ్దుల్ రషీద్ ఉన్నారు.

నంద్యాల రూరల్: వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు తెలపాలని విప్ జారీ చేయడం దుర్మార్గపు చర్య అని నంద్యాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పుల్లయ్య అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ, జనసేన పార్టీకి పుట్టగతులుండవని అన్నారు. ఈ బిల్లును ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు.

'చర్యలు తీసుకోవాలి'

ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలు పని చేసినా హాజరు వేయని ఉపాధి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి నరసింహనాయక్, మండల సహాయ కార్యదర్శి రాజు కోరారు. మండలంలోని నల్లకాలువ గ్రామంలో ఉపాధి పనులు జరుగుతున్న పని ప్రదేశంలో వారు ఉపాధి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నాయకులు మాట్లాడుతూ.. ఈ నెల 1,2వ తేదీలలో ఉపాధి హామి పనులు చేసేందుకు వచ్చిన కూలీలు పని ప్రదేశాలకు వచ్చినప్పటికి యాప్ పని చేయడం లేదని సిబ్బంది చెబుతూ హాజరు వేయడం లేదని ఉపాధి కూలీలు తెలిపారన్నారు. గత రెండు రోజులుగా సిబ్బంది ఇదేవిధంగా చెబుతున్నారని కూలీలు వాపోయారన్నారు. తక్షణమే జిల్లా అధికారులు స్పందించి నల్లకాలువ ఉపాధి కూలీలకు రెండు రోజులు పని చేసినట్లుగా మస్టర్ వేసి బిల్లులు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పని ప్రదేశంలో మౌళిక వసతులు కల్పించాలని,పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

విద్యార్థి ఆచూకీ లభ్యం

- కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జూపాడుబంగ్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 8వతరగతి చదువుతున్న మధుసూదన్ అనే విద్యార్థి మంగళవారం పాఠశాల నుంచి అదృశ్యం అయ్యాడని జూపాడుబంగ్లా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం చెర్లకొత్తూరు గ్రామానికి వెళ్లకపోవడంతో విద్యార్థి తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. బుధవారం మధ్యాహ్నం డోన్ పట్టణంలో బంధువులకు కనబడటంతో విద్యార్థి తల్లిదండ్రులు జూపాడుబంగ్లాకు తీసుకొచ్చారు. పోలీసుస్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చి పంపినట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

'మెదడులో మార్పుల వల్లే ఆటిజం'



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

పాణ్యం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మెదడులో రసాయన మార్పులే ఆటిజానికి కారణమని సమగ్ర శిక్ష ఐఈ కోఆర్డినేటర్ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ అటిజం దినోత్సవం సందర్భంగా భవిత కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉర్దూ ఉపాధ్యాయుడు నిసార్ అహ్మద్, షహనాజ్ బేగం, ఐఈఆర్‌పీ సంపూర్ణ రావు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



రూ.65 లక్షలతో ప్రార్థనామందిరాల్లో

మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు

మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి వెల్లడి


బ్రోచర్ విడుదల చేస్తున్న బీసీ రాజారెడ్డి, మత పెద్దలు

బనగానపల్లె, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తన తల్లిదం డ్రులు కీ.శే. బీసీ గుర్విరెడ్డి, బీసీ లక్ష్మమ్మ దంపతుల జ్ఞాపకార్థం పట్టణంలోని అన్ని మతాల ప్రార్థనా మందిరాల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన బీసీ రాజారెడ్డి కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ పట్టణంలోని హిందూ ఆలయాలు, మసీదులు, చర్చిలకు రూ.65లక్షల విలువ చేసే మినరల్ వాటర్‌ప్లాంట్లు కేటాయిస్తున్నాం. పట్టణంలోని ఆయా ప్రార్థనా మందిరాలకు సంబంధించిన కొందరు మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. బనగానపల్లె పట్టణంలోని మసీదులు, దేవాలయాలు, చర్చిలకు మాత్రమే ఈ సదుపాయం కల్పించామన్నారు. 1500 లీటర్ల కెపాసిటీ గల ప్రీమియం క్వాలిటీ వాటర్ ప్లాంట్‌తో పాటు 80 లీటర్ల కెపాసిటీ కల బ్రూస్టార్ కంపెనీకి చెందిన కూలింగ్ వాటర్ మిషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చిన్నమందిరాలకు 500 లీటర్ల కెపాసిటీగల మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ కాలనీ మసూంబాషామౌలా, మసీ దు పేష్‌ఇమాం ఇస్మాయిల్ మియా, పాస్టర్ బాబురాజ్, ఆంజనేయ స్వామి పూజారి ఆనంద ప్రసాదశర్మ తదితరులు పాల్గొన్నారు.

పనిలో పనిగా..


చాగలమర్రిలో బైక్‌పై రేకు నెత్తిన పెట్టుకొని తీసుకెళ్తున్న దృశ్యం

చాగలమర్రి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఏ ఎండకు ఆ గొడుగు అంటే ఇదేనేమో. ఎండలు రోజు రోజుకు ముదురుతున్నాయి. నూర్యుడు ప్రతాపం చూపిస్తున్నాడు. అలాగని బయటకు రావటం తప్పదు కదా. ఓ పని కోసం బైక్‌పై రేకు తీసుకెళ్తున్న వీరిద్దరు ఎండ నుంచి కాపాడుకోవడానికి దానినే ఇదు పెట్టుకున్నారు. చాగలమర్రి బాలికల పాఠశాల సమీపంలో బుధవారం కనిపించిన ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.

'పేరు తొలగించడం హేయమైన చర్య'

ప్యాపిలి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నైపుణ్య అభివృద్ధి కేంద్రం బోర్డు పై దివంగత మాజీ ఎమ్మెల్యే బుగ్గన శేషారెడ్డి పేరును తొలగించడం హేయమైన చర్య అని మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు అన్నారు. శేషారెడ్డి పేరును తొలగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని బుధవారం పట్టణంలో వైసీపీ నాయకులు ఆందోళన చేశారు. అనంతరం పేరును తొలగించిన వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని నేతలు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు బోరెడ్డి పుల్లారెడ్డి, మెట్టు వెంకటేశ్వరరెడ్డి, రామచంద్రారెడ్డి, మునిరెడ్డి, కృష్ణమూర్తి, మల్లికార్జునరెడ్డి, బోరెడ్డి రాము, వాసురెడ్డి, జబీర్, సోమశేఖర్, జయరామయ్య, రాయమూర్తి పాల్గొన్నారు.

సురక్షితంగా గమ్యానికి చేర్చాలి

డోన్ టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యాలకు చేర్చాలని ఉమ్మడి జిల్లా డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ హరినారాయణ తెలిపారు. బుధవారం ఆయన డోన్ డిపో మేనేజర్ శశిభూషణ్‌తో కలిసి బస్సులో ప్రయాణించి తనిఖీలు చేశారు. గ్యారేజీలోని అన్ని సెక్షన్ల పనితీరును పరిశీలించారు. వేసవి కాలం దృష్ట్యా ఉండకుని ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

డోన్ రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): డోన్ నియోజకవర్గంలోని బేతంచెర్ల మండలం ఆర్‌ఎస్ రంగాపురం, డోన్ మండలం దేవరబండ గ్రామాల్లో బుధవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఆర్‌ఎస్ రంగాపురం చెందిన సాగర్ అనే వ్యక్తి నుంచి 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. అలాగే దేవరబండ గ్రామానికి చెందిన మద్దయ్య, ఈడిగ రవిల నుంచి 60 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వరలక్ష్మి తెలిపారు. దాడుల్లో సీఐ లక్ష్మణదాసు, ఎస్ఐలు సోమశేఖర్‌రావు, దౌలత్‌ఖాన్, మారుతి ప్రసాద్ పాల్గొన్నారు.

కరువు మండలంగా కొలిమిగుండ్ల

- జిల్లాలో మరో ఐదు సాధారణ కరువు మండలాలు ఎంపిక
- ఊపిరి పీల్చుకున్న అన్నదాతలు
- మంత్రి బీసీకి కృతజ్ఞతలు

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో అత్యల్ప వర్షపాతం నమోదు కావడంతో పాటు, ఎలాంటి సాగు నీటి వనరులు లేని కొలిమిగుండ్ల మండలాన్ని ప్రభుత్వం కరువు తీవ్రత మండలంగా ప్రకటించింది. నంద్యాల జిల్లాలో ఒకే ఒక కరువు తీవ్రత మండలంగా కొలిమిగుండ్ల ఎంపిక అయింది. మరో వైపు నంద్యాల జిల్లాలో మొత్తం ఐదు మండలాలను కరువు మండలాల జాబితాలో స్థానం దక్కగా, బనగానపల్లె నియోజకవర్గంలోని కొలిమిగుండ్ల, బనగానపల్లె, సంజామల మూడు మండలాలు ఎంపికయ్యాయి. ఇందులో సంజామల, బనగానపల్లె సాధారణ కరువు, కొలిమిగుండ్ల మాత్రమే కరువు తీవ్రత మండలాల జాబితాలో చోటు దక్కింది. ఇక ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ఉయ్యాలవాడ, డోన్‌లోని బేతంచర్ల మండలాలు కూడా సాధారణ కరువు మండలాల జాబితాలో ఉన్నాయి. వర్షాభావ పరిస్థితులు, పంటలు ఎండిపోయి దెబ్బతిన్న పరిస్థితులను మంత్రి బీసీ ప్రత్యేక చొరవ తీసుకొని ఉన్నతాధికారులను అప్రమత్తం చేయడంలో సఫలీకృతులయ్యారని కొలిమిగుండ్ల మండల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఇప్పటికే భూ గర్భజలాలు అడుగంటి ఉన్నవనే పంటలు ఎండిపోవడంతో పాటు, తాగు నీటి కష్టాలు తీవ్రమయ్యాయి.


ఎండిపోయిన జొన్న సాగు(ఫైల్)

కొలిమిగుండ్ల మండలంలోని వివిధ గ్రామాల్లో రబీ సీజన్‌లో మొత్తం 14వేల ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలను సాగు చేసినట్లు అధికారులు పంట నమోదు చేశారు. ఇందులో అత్యధికంగా 10వేల ఎక రాల్లో వప్పశనగ పంటని రైతులు సాగు చేశా రు. మిగిలిన వాటిలో జొన్న, సజ్జ, మొక్క జొన్న, వాము, మిర్చి, మినుము, తదితర పంట లను రైతులు సాగు చేసినట్లు వ్యవ సాయ శా ఖాధికారులు పేర్కొన్నారు. కాగా, రబీ సీజన్‌లో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పప్పు శనగపంట పూర్తిగా దెబ్బతినింది. ఎకరానికి రెండు క్వింటాళ్లు కూడా దిగుబడి రాకపోవడం తో తీవ్ర నష్టం వాటిల్లింది. ఈనేపథ్యంలో కరువు మండలంగా ఎంపిక కావడంతో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు అనేక ప్రయోజనాలు చేకూరనున్నాయి. పంటల బీమా ప్రయోజనం, పంట రుణాలు కల్పించడం, ప్రత్యేక పంట నష్ట పరిహారం అందనుంది. మరోవైపు కరువు మండలాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, అదనపు నిధులు కేటాయించే అవకాశం ఉంటుందని, ఉపాధి పని దినాలు పెంచనున్నట్లు పేర్కొంటున్నారు.

ప్రభుత్వానికి ధన్యవాదాలు


కరువు మండలంగా ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉంది. వర్షాలు లేక పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపో యాం. ప్రభుత్వానికి ధన్యవాదాలు.
- పోరెడ్డి నారాయణరెడ్డి, మీర్జాపురం

ఉదారంగా సాయం అందించాలి


పప్పు శనగ దిగుబడి తగ్గి తీవ్రంగా నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఉదారంగా ఆర్థిక సహాయం అందించాలి. కరువు మండ లంగా ఎంపిక చేసిన మంత్రి బీసీకి కృతజ్ఞతలు.
- రాజేశ్వరరెడ్డి, నందిపాడు

మార్గదర్శకాలు రావాలి


ప్రభుత్వం కరువు మండలాల జాబితా ప్రకటించింది. జిల్లాలో ఒకే ఒక్క అత్యంత కరువు మండలం కొలిమి గుండ్ల మాత్రమే ఉంది. ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో మార్గదర్శకాలు రావాల్సిఉంది.
- సుధాకర్, ఏడీఏ, వ్యవసాయ శాఖ

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

చాగలమర్రి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో ఎన్‌సీడీ సీడీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్రీయ బాలసురక్ష జిల్లా నోడల్ అధికారి కాంతారావునాయక్ ఆదేశించారు. బుధవారం చాగలమర్రి గ్రామంలో ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేశారు. సర్వేకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం, ఆల్బెండజోల్, ఐరన్ గుళికల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మూడవ సచివాలయంలో జరుగుతున్న ఎన్‌సీడీ కార్యక్రమాన్ని, 1 నుంచి 5వ సచివాలయాలను సందర్శించి ఎన్‌సీడీ సీడీ సర్వేల గురించి వైద్య సిబ్బందికి సూచనలు, సలహాలు తెలియజేశారు. 18 సంవత్సరాలు పైబడిన వారందరికి బీపీ, షుగర్, క్యాన్సర్ పరీక్షలు తప్పనిసరిగా చేయాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు 50 శాతం సర్వే పూర్తయిందని, ఈనెల చివరి నాటికి వంద శాతం పూర్తి చేస్తామని అన్నారు. క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ అయితే వైద్య చికిత్సలు అందిస్తామని తెలియజేశారు. వైద్యులు, వైద్య సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం చేయరాదని అన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఇమామ్, అంజలి, సీహెచ్‌ఓ రమణమ్మ, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌బీఎస్‌కే జిల్లా నోడల్ అధికారి

అలసత్వం వహించొద్దు: మంత్రి బీసీ

బనగానపల్లె, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహించొద్దని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం ఉదయం మంత్రి కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కారం కోసం వచ్చే అర్జీలను మంత్రి స్వీకరించారు. పలు సమస్యలను పరిష్కరించారు. కొన్ని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజలు నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారు.

అండర్ డ్రైనేజీ పనుల పరిశీలన

బనగానపల్లె పట్టణంలో అండర్ డ్రైనేజీ పనులను బుధవారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పరిశీలించారు. జురేరు వాగు సుందరీకరణ పనులపై ఆరాతీశారు. జురేరువాగులోకి మురుగునీరు వెళ్లకుండా ప్రత్యామ్నాయంగా కొత్తగా పట్టణంలో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

యాగంటిలో అభివృద్ధి పనులు

మండలంలోని ప్రముఖ పురాతన శైవ క్షేత్రమైన యాగంటి క్షేత్రానికి సొంత నిధులు రూ.15 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. బుధవారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి యాగంటి క్షేత్రాన్ని దర్శించుకున్నారు. ఈవో చంద్రుడు, సిబ్బంది పూజారులు, పాణిపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, మౌళీశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఆరెస్ నాగిరెడ్డి, శంకరేశ్వరరెడ్డి, తిరుమలయ్య తదితరులు మంత్రి బీసీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. నందీశ్వరున్ని, యాగంటి ఉమామహేశ్వరున్ని దర్శించుకొని మంత్రి బీసీ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ గర్భాలయంలో సొంత నిధులు రూ.4 లక్షలతో భక్తుల సౌకర్యార్థం రెండు ఏసీల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే మరో రూ. 11లక్షల సొంత నిధులతో ఆలయంలో వివిధ మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆలయంలో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఆలయ పరిసరాలను మొత్తం మంత్రి కలియతిరిగి పరిశీలించారు. భక్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో భరతుడు, విష్ణువర్ధన్‌రెడ్డి, రంగస్వామి, బూషన్న, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

'అనాథ విద్యార్థిని దత్తత తీసుకుంటా'

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రతి సంవత్సరం తల్లిదండ్రులు లేని ఒక అనాథ విద్యార్థిని దత్తత తీసుకుంటానని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పుట్టినరోజు సందర్భంగా విశిష్ట విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన పలువురు విద్యార్థులకు నగదు బహుమతి, మెమెంటోలను ఎమ్మెల్యే బుధవారం పంపిణీ చేశారు. పట్టణంలోని రామలింగారెడ్డి కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే అఖిలప్రియ మాట్లాడుతూ యువత ఆలోచనలే అభివృద్ధికి సోపానాలు అన్నారు. యువత అన్ని రంగాల్లో రాణించడంతో పాటు రాజకీయాల్లోకి కూడా రావాలని ఆకాంక్షించారు.


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

● అహోబిలంలో ఎమ్మెల్యే దంపతుల పూజలు :

తన పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ భర్త భార్గవ్‌రామ్, కుమారుడుతో కలిసి ఎగువ, దిగువ అహోబిల క్షేత్రాల్లో లక్ష్మీ నృసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అహోబిలంలో వెలసిన మల్లెమ్మ అమ్మవారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. చెంచు మహిళలకు ఎమ్మెల్యే చీరలు పంపిణీ చేశారు.

● సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని 22 మందికి ప్రభుత్వం నుంచి మం జూరైన రూ.22.58 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే అఖిలప్రియ బాధితుల కుటుంబీకులకు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడుకు, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు వారు కృతజ్ఞతలు తెలిపారు. పలువురు నాయకులు తరలివచ్చి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద చక్రవర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు.

చాగలమర్రి: ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ జన్మదినం సందర్భంగా చాగలమర్రిలో టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, నంద్యాల మైనార్టీ నాయకుడు కొలిమి ఉసేన్‌వలి కేక్ కట్ చేశారు. స్థానిక కేరళ వైద్యశాలలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. నగల్లపాడు సమీపంలోని అనాథాశ్రమంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైద్యులు ప్రకాష్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రుద్రవరం: మండల కేంద్రంలోని అమ్మవారి సెంటర్‌లో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ జన్మదిన వేడుకలు నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోలా గురుమూర్తి, బండారు బాలరాజు,శేఖర్, కమ్మలపాటి పాల్గొన్నారు.



నందవరంలో వైద్య శిబిరం

బనగానపల్లె, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శక్తిక్షేత్రమైన నందవరం చౌడేశ్వరీమాత బ్రహ్మోత్సవాల సందర్భంగా టీడీపీ నాయకులు బీసీ ఇందిరమ్మ బుధవారం వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. బనగానపల్లె మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. అలాగే బొబ్బల రామయ్య ఫ్రొరెడ్డి నిర్వహించిన ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం దేవస్థానానికి వచ్చిన భక్తులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అమ్మవారికి సేవలందించడం సంతోషంగా ఉందని ఆమె తెలిపారు. టీడీపీ నాయకులు టంగుటూరు శ్రీనయ్య, మల్లారెడ్డి, నాగేంద్రారెడ్డి, నాగరాజు, ఖాదర్, పబ్బిరెడ్డి, ఆనంద్, శేఖర్, మహిపాల్, మెడికల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు

ఉయ్యాలవాడ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు, వీఆర్వోలు వెంకటలక్ష్మి, దస్తగిరి, వెంకటేశ్వర్లు, దాదా, నాయుడు తదితరులు ఉన్నారు.

అవుకు విద్యార్థినుల ప్రతిభ

అవుకు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించిన జిల్లా స్థాయి ఈపీడీపీ ప్రోగ్రాం పోటీల్లో అవుకు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రథమ బహుమతిని అందుకున్నట్లు పాఠశాల హెచ్ఎం ఉమామహేశ్వరి బుధవారం తెలిపారు. అవుకు పాఠశాలకు చెందిన విద్యార్థినులు దీపిక, కీర్తి, మేఘన పాల్గొని వేస్ట్‌మెటీరియల్‌తో చేసిన వస్తువుల తయారీకి ప్రథమ బహుమతి లభించిందన్నారు. పాఠశాల హెచ్ఎం చెన్నకేశవుర, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందనలు తెలిపారు.

కోవెలకుంట్లకు చేరిన కుట్టుమిషన్లు

కోవెలకుంట్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెలుగు కార్యాలయానికి 50 కుట్టుమిషన్లు వచ్చినట్లు ఎంపీడీవో వర ప్రసాద రావు తెలిపారు. బుధవారం ఎంపీడీవో మిషన్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పొదుపు మహిళలకు టైలరింగ్ శిక్షణ ఇవ్వడం కోసం కోవెలకుంట్ల, సంజామల మండలాలకు కలిపి కోవెలకుంట్లలో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. వెలుగు కార్యాలయంలో 25, ఇండోర్ స్టేడియంలో 25 కుట్టు మిషన్లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి త్వరలోనే ఈ రెండు కేంద్రాల్లో శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ గురుస్వామి, ఏపీఎం శేఖర్, సీసీలు గోపాలకృష్ణ, నిర్మల, వెంకటస్వామి, లీగల్ కోఆర్డినేటరు నరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.


కుట్టుమిషన్లు పరిశీలిస్తున్న ఎంపీడీవో వర ప్రసాదరావు

బాధ్యతలు చేపట్టిన ఏపీవో శ్రీకాంతరెడ్డి

కోవెలకుంట్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ఏపీవోగా శ్రీ కాంతరెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా కోవెలకుంట్లలో పనిచేసే ఏపీవో శ్రీవిద్య ను ప్యాపిలికి, నంద్యాలలో పనిచేసే శ్రీకాంతరెడ్డిని కోవెలకుంట్లకు బదిలీ చేశారు.

కుందూలో తగ్గిన నీటి ప్రవాహం

చాగలమర్రి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజోలి ఆనకట్ట వద్ద ఎండ తీవ్రతతో కుందూ నీటి ప్రవాహం తగ్గింది. ఆనకట్ట వద్ద 500 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. ఆనకట్ట నుంచి కేసీ ప్రధాన కాలువకు 200 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. ఆయకట్టు రైతులకు ఉన్న నీటిని సరఫరా చేస్తున్నామని కేసీకెనాల్ ఏఈ జమాల్‌వలి తెలిపారు. మూగజీవాలు, రైతులు, కూలీలకు తాగునీటి కోసం కుందూ గేట్లను మూసివేసి నీటి నిల్వ ఉంచామని అన్నారు.

5న చిన్నవంగలిలో బండలాగుడు పోటీలు

చాగలమర్రి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న వంగలిలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా 5న న్యూ కాటగిరి విభాగానికి చెందిన ఒంగోలు జాతి వృషభరాజముల బండలాగుడు పోటీలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వృషభరాజములకు వరుసగా రూ.80 వేలు, రూ.60 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేల నగదును దాతలు అందజేస్తారన్నారు. 6న సీతారాముల కల్యాణం, గ్రామోత్సవం ఉంటుందన్నారు. శ్రీరామనవమి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

చాగలమర్రి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని గిరిజన కాలనీలో 15వ ఆర్థిక సంఘం నిధులతో ఏర్పాటు చేసిన రూ.15 లక్షల సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను బుధవారం సర్పంచ్ తులశమ్మ, ఉపసర్పంచ్ సోహేల్, ఈవోఆర్డీ తాహిర్ హుసేన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఆర్థిక సంఘం నిధులతో పనులు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అనూష, వార్డు సభ్యులు సుశీల, టీడీపీ నాయకులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలను వినియోగించుకోవాలి

రుద్రవరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం మండలంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో భాగ్యలక్ష్మి బుధవారం తెలిపారు. మండలంలోని పెద్దకంబలూరు, టి.లింగందిన్నె, శ్రీరంగాపురం గ్రామాల్లో గురు,శుక్రవారాల్లో ఆధార్ కేంద్రాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆధార్ కార్డులో తప్పు ఒప్పులున్న వారు సరిచేసుకోవాలని కోరారు. ముఖ్యంగా 0-6 సంవత్సరాల పిల్లలకు ఆధార్ కార్డులు తల్లిదండ్రులు చేయించాలని ఎంపీడీవో కోరారు.

టీడీపీ సభ్యత్వ కార్డులతో కార్యకర్తలకు రక్షణ

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్డులతో కార్యకర్తలకు అన్నివిధాలా రక్షణ ఉంటుందని టీడీపీ యువత మండల అధ్యక్షుడు గొంగటి హనీఫ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పెట్నికోట గ్రామంలో సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. గ్రామంలో రికార్డు స్థాయిలో 1000 సభ్యత్వాలు నమోదు చేయడం సంతోషంగా ఉందన్నారు.

ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోర్విమానుపల్లెలో తాగునీటి ఎద్దడి నివారణకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నామని ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు పలి ప్రతాపరెడ్డి అన్నారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, బీవీ పట్టీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో తన సొంత నిధులతో తాగునీరు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో నీటి ఎద్దడి నెలకొన్న వీధుల్లో ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తామన్నారు.

నేడు రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం

కోవెలకుంట్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో అన్ని పార్టీలకు చెందిన రాజకీయ నాయకులతో గురువారం ఉదయం 11గంటలకు సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓటరు జాబితాలో సవరణపై పేర్లు మార్పులు చేయులు సమావేశం నిర్వహించి నాయకుల సలహాలు, సూచనలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

డోన్ టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం రోటరీ భవన్‌లో గుండె, కంటి వైద్య పరీక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు రోటరీ అసిస్టెంట్ గవర్నర్ దశరథరామిరెడ్డి, ప్రెసిడెంట్ శివశంకర్‌గౌడ్, సెక్రటరీ వి.మల్లారెడ్డి బుధవారం తెలిపారు. కర్నూలు గౌరీగోపాల్ హాస్పిటల్ సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ వి.గణేశ్వర్ రెడ్డి పరీక్షిస్తారన్నారు.

ఆర్‌ఎస్ రంగాపురంలో...

బేతంచెర్ల: మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలోని నంద్యాలకు చెందిన ఓ ప్రైవేటు ఆసుపత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రద్యుమ్న, డాక్టర్ నమత, డాక్టర్ శర్వాణి, డాక్టర్ శిరీష ప్రజలకు కంటి వైద్య పరీక్షలతో పాటు షుగర్, బీపీ, ఆర్థోపెడిక్ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ పీఆర్‌ఓ రమణ, టెక్నీషియన్లు జ్యోతిరాణి, కిషోర్‌బాబు పాల్గొన్నారు.

టంగుటూరులో బండలాగుడు పోటీలు

బనగానపల్లె, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలంలోని టంగుటూరు గ్రామంలో బుధవారం నిర్వహించిన బండలాగుడు పోటీలను టీడీపీ నాయకుడు బీసీ రామనాథరెడ్డి ప్రారంభించారు. విజేతలకు వరుసగా రూ.60వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు బహుమతులు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బానాల లక్ష్మీకాంతరెడ్డి, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

'మైనార్టీల ప్రయోజనాలను దెబ్బతీస్తున్న కేంద్రం'

డోన్ రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మైనార్టీల ప్రయోజనాలను దెబ్బతీసేవిధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త గార్లపాటి మద్దిలేటి ఆరోపించారు. బుధవారం నియోజకవర్గ కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మైనార్టీల ప్రయోజనాలకు భంగం కలిగిస్తూ కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును తీసుకువచ్చిందని దుయ్యబట్టారు. 13మందిని నంద్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీలోకి తీసుకోవడంపట్ల మద్దిలేటి హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.